క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమిపూజ


పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 2, 26వ వార్డుల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని భూమిపూజ చేశారు. 2వ వార్డులో రూ.10 లక్షల సాధారణ నిధులతో సీసీ రోడ్డు, 26వ వార్డులో రూ.20 లక్షల వ్యయంతో డ్రైనేజీల నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దీత వ్యవధిలోగా పనులను పూర్తి చేయాలని ఆమె కాంట్రాక్టర్‌లకు సూచించారు. కౌన్సిలర్లు లక్ష్మి, మెహరున్నీసా, కమిషనర్ నయీమ్ అహ్మద్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల్లో సీట్లు కేటాయించాలి

గుంతకల్లు రూరల్: రాయలసీమలో నిర్మాణం పూర్తయిన మెడికల్ కళాశాలకు వెంటనే ఎంబీబీఎస్ సీట్లు కేటాయించాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఒకేసారి 17 మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో కొన్నింటిని ఇప్పటికే ప్రారంభించారన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి: మండల కేంద్రంలో ఐదుగురు పేకాటరాయుళ్లను బుధవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. వారి నుంచి రూ.17,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సజావుగా కౌన్సిల్ సమావేశం


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

తాడిపత్రి రూరల్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రహీం అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం సజావుగా జరిగింది. వచ్చే నెలలో 2025–26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు కమిషనర్ శివరామక్రిష్ణ తెలిపారు. అనంతరం వివిధ అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, సీపీఐ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'గేట్స్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గుత్తి: అనంతపురం జేఎన్‌టీయూలో జరిగిన పిక్సెల్ 2కె 24, డైనమెక్స్ 2కె 24 సదస్సుల్లో గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీఎస్‌ఈ విద్యార్థులు వెంకట సాయి రేవంత్, తిలక్ మణి ప్రథమ, ఇదే విభాగానికి చెందిన మహమ్మద్ అబ్రూరుల్ హక్, అల్లావలి తృతీయ, మెకానికల్ విద్యార్థులు యుగంధర్ అశో తృతీయ బహుమతిని సాధించారు. బుధవారం వీరిని కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ఎండి రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా అభినంచారు.

- మండలంలో గాడితప్పిన పాలన
- తహసీల్దార్, ఎంపీడీఓ, పశుశాఖ, ఉద్యాన, పీఆర్‌కు రెగ్యులర్ అధికారులు కరువు
- సమస్యలతో సతమతమవుతున్న జనం

అందరూ ఇన్‌చార్జ్‌లే!


ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు(ఫైల్)


తహసీల్దార్ కార్యాలయం

యల్లనూరు: మండలంలో కీలక శాఖలన్నింటిలో ఇన్‌చార్జ్‌లే ఉండటడంతో పాలన ముందుకు సాగడం లేదు. ఆయా శాఖాల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో నిర్ణయాలను వేగంగా తీసుకోలేకపోతున్నారు. దీంతో పాలన గాడి తప్పుతోంది. ఫలితంగా ప్రజలు తమ సమస్యలు పరిష్కారం గాక కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇన్‌చార్జ్‌లే దిక్కు..

మండలంలో కీలకమైనది రెవెన్యూ శాఖ. ఇందులో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దార్ నాగరాజుకు ఆరోగ్యం సరిగ్గా లేక దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌బాషా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారని ఆయన సెలవులో ఉన్నారు. దీంతో ఆర్‌ఐ చిన్ననారాయణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరావుపై తీవ్రమైన పని ఒత్తిడి ఉంది. ఇక మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి ఎంపీడీఓ సౌజన్య జాయిన్ అయి వెంటనే అదేరోజు డీపీఆర్సీలో డిప్యుటేషన్‌పై వెళ్లింది. కార్యాలయ ఏఓగా ఉన్న వాసుదేవరెడ్డికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలను కట్టబెట్టారు. దీంతో మండలంలో అభివృద్ధి పనులపై ప్రభావం పడుతోంది. ఉద్యాన అధికారులు పత్తాలేరు. ఏడీ స్థాయి అధికారి ఉండాల్సిన యల్లనూరు పశువైద్యశాలకు దిక్కేలేరు. తాడిపత్రి ఏడీ ఖాదర్‌బాషాకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో పుట్లూరు పశువైద్యాధికారి సువర్ణకు ఇన్‌చార్జ్ బాధతలు అప్పగించారు. వారి వచ్చినప్పుడే వచ్చారు అనుకోవాలి. పశువైద్యం కుంటు పడి మూగజీవాల పెంపకందారులు తాడిపత్రి, పులివెందుల ప్రయివేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

తూతూ మంత్రంగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తూతూ మంత్రంగా సాగుతున్నట్లు ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఐదుశాఖల అధికారులే హాజరవుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. సోమవారం ఎన్ని పనులు ఉన్నా కలెక్టరు వినోద్ కుమార్ స్వయాన అన్ని పనులు పక్కన పెట్టి హాజరవుతున్నారు. కానీ ఇక్కడ మాత్రం వచ్చిన అధికారులు సంతకాలు చేసి ఐదు నిమిషాలు కుర్చీల్లో కూర్చొని వెళ్లిపోతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్ కోసం ఏళ్ల నుంచి తిరుగుతున్నా



పదేళ్ల నుంచి మా భూమిని ఆన్‌లైన్లో ఎక్కించేందుకు అష్టకష్టాలు పడుతున్నాను. మా నాన్న, నేను తిరిగి తిరిగి ఇబ్బందులు పడుతున్నాం. ఏ ఒక్క అధికారి మా సమస్యను తీర్చలేకున్నారు. మాకున్న 408–బి సర్వే నెంబరు 1.28 సెంట్లు ఎక్కాలి. ఆన్‌లైన్ ఎక్కించడంతో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. వారంలో నా సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరుకు ఫిర్యాదు చేస్తా.

– రైతు శ్రీనివాసులు, తిమ్మంపల్లి

నా భూమిని నాకు ఇప్పించండి



నా పేరుపై ఉన్న భూమిని వేరే వాళ్లు అన్‌లైన్ చేయించుకున్నారు. సర్వే నంబరు 365 –హెచ్‌లో 2.88 సెంట్లు, 365–ఐ లో 2.83 సెంట్లు భూమి ఉంది. నాపేరుతో రిజిష్టర్లు అయ్యాయి. నా భూమిని వేరే వాళ్లు నాలుగేళ్ల కిందట తీసుకున్నారు. నాకు అధికారులు అన్యాయం చేశారు. పలుమార్లు స్పందనలో అర్జీలు ఇచ్చినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నా భూమిని నాకు ఇప్పించాలని కోరుతున్నా.

– రైతు రాజశేఖర్, దంతలపల్లి

చర్యలు తీసుకుంటాం

పుట్లూరు రెగ్యులర్, యల్లనూరు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. నేను కొత్తగా వచ్చాను. నాకు యల్లనూరు మండలంపై అవగాహన లేదు. రెండు మండలాల బాధ్యతలు కష్టంగా ఉంది. భూ సమస్యలు ఉన్నట్లు నా దృష్టికి వచ్చాయి. కొన్నింటిని పరిష్కరిస్తున్నాం. దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి పెడుతున్నాం. త్వరలో సమస్యలను పరిష్కరిస్తాం.

– శేషారెడ్డి,
ఇన్‌చార్జ్ తహసీల్దార్, యల్లనూరు

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు


రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అనంతపురములోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారని, ఇందులో మోడల్ స్కూల్ విద్యార్థులు ఈశ్వరయ్య, చరణ్‌దీప్, వినయ్‌వర్మ, ధనుష్ , రేవతి, హరిప్రియ అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు నవంబర్ 5 నుంచి 9 వరకు పల్నాడు జిల్లా బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు, పీఈటీ వెంకటేష్‌ను పాఠశాల సిబ్బంది అభినందించారు.

గార్లదిన్నె: ఇల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ఆర్ట్స్ ఉపాధ్యాయుడు గురుస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏటా ముంబయిలోని రంగోత్సవ్ సెలబ్రేషన్స్ సంస్థ నిర్వహించిన పోటీల్లో ఇల్లూరు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 130 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో ఒక విద్యార్థి ఆర్ట్ మెరిట్ అవార్డ్ ట్రోఫీ సాధించాడన్నారు. అలాగే 10 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్, 8 మంది విద్యార్థులు సిల్వర్ మెడల్, నలుగురు విద్యార్థులు బ్రాంజ్ మెడల్, ఒక విద్యార్థి కన్సోలేషన్ బహుమతి గెలుపొందారన్నారు. పాఠశాల నుంచి సోషల్ స్కూల్ అసిస్టెంట్ అనసూయమ్మ పాల్గొనగా ప్రశంసా పత్రం, బహుమతి సాధించారన్నారు.

బుక్కరాయసముద్రం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఇటీవల వెస్ట్ గోదావరి జిల్లా మార్టేరులో జరిగిన పోటీలలో అండర్–17 అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి టోర్నీ అనంతపురం జిల్లా జట్టు బాస్కెట్‌బాల్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు. ఇందులో బీకేఎస్ హైస్కూల్‌కు చెందిన నాగ నందిని జట్టు గెలుపులో కీలక పాత్ర వహించిందన్నారు. నాగ నందినిని ఇన్‌చార్జ్ హెచ్ఎం నాగరాజు గౌడ్ అభినందించారు.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి


నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ విమర్శించారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వ తీరుపై బుధవారం పొట్టిశ్రీరాములు సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బద్వేల్‌లో విద్యార్థిని, చిలమత్తూరులో అత్తాకోడళ్లు, పలాసలో అక్కాచెల్లెమ్మలపై అత్యాచారాలు జరిగినా, నందికొట్కూరులో ఆరేళ్ల బాలిక అదృశ్యమైనా ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదని ఆయన మండిపడ్డారు. సాక్ష్యాత్తు టీడీపీ ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, కొలికిపూడి శ్రీనివాస్ మహిళలను లైంగిక వేధింపులకు గురిచేసినట్లు ఆధారాలతో సహా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయినా వారిపై చర్యలు తీసుకోవడంలో చంద్రబాబు సర్కారు చతికిలపడిందన్నారు. మహిళల రక్షణకు కఠిన చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ పట్టణ అధ్యక్షుడు హనుమంతు, నాయకులు జిలాన్,రామ్‌దాస్, నారాయణ, గోపి పాల్గొన్నారు.

కరువు మండలాల జాబితాను పునఃపరిశీలించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లు రూరల్: జిల్లాలో ప్రకటించిన కరువు మండలాల జాబితాను ప్రభుత్వం పునఃపరిశీలించాలని సీపీఎం నాయకులు కోరారు. బుధవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టి కారణంగా జిల్లా వ్యాప్తంగా తీవ్రపంటనష్టం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 31 మండలాలను కరువు మండలాలుగాప్రకటించాల్సి ఉండగా, ప్రభుత్వం కేవలం 7 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం దారుణమన్నారు. సకాలంలో వర్షాలు రాక జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 లక్షల ఎకరాలు బీడుగా వదిలేశారన్నారు. ప్రభుత్వం పునఃపరిశీలించి జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని కోరారు.

శింగనమల: శింగనమల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తరిమెల సచివాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ కింద సాగు చేసిన వేరుశనగ, పత్తి , కంది, ఆముదం పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని కోరారు. సీపీఎం నాయకులు రమణ, రామాంజినేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గుత్తిలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం నేతలు నిర్మల, మల్లికార్జున, మల్లేష్ మాట్లాడుతూ జిల్లాలో 31 మండలాలు ఉండగా ప్రభుత్వం ఏడింటిని మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు.

అవినీతి రహిత సమాజం నిర్మిద్దాం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

గుంతకల్లు: అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎస్‌డీజీఎం విజయన్, డీఆర్ఎం విజయ్‌కుమార్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రైల్వే కంట్రోల్ కార్యాలయంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాయితీతో విధులు నిర్వర్తిస్తున్నామని, లంచాలు తీసుకోమని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి నిజాయితీగా పని చేయాలన్నారు. నిర్దేశిత నియామలను అనుసరించాలన్నారు. స్నేహపూరితమైన వాతవరణంలో పని చేసినప్పుడే చేసే పనిలో సంతృప్తి లభిస్తుందన్నారు. ఇక ఉద్యోగులు లంచగొండితనంపై నిర్వహించిన ప్రదర్శన ఆకుట్టుకుంది. అంకిత భావంతో పని చేసిన పలువురు ఉద్యోగులకు ప్రశంసాపత్రంతోపాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, జోనల్ అధికారి రాకేష్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లు రూరల్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.3480 కోట్లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వైటీ చెరువు రమేష్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో అధికార ంలోకి వచ్చిన నెలరోజుల్లోనే పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రైవేటు వర్సిటీల్లో చదివే విద్యార్థులు ఓ పక్క ఫీజులు కట్టలేక, యాజమాన్యం ఒత్తిళ్లు భరించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.

పామిడి: పామిడిలోని కృష్ణవేణి ఇంగ్లిష్ మీడియం స్కూల్ అధిక ఫీజులు వసూలు చేయడాన్ని అరికట్టాలని ఆర్ఎస్‌యూ నేతలు డీఈఓ ప్రసాద్ బాబుకు ఫిర్యాదు చేశారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ ఫీజుల వసూళ్లపై ఎంఈఓకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

'ఎస్ఆర్ఐటీ' విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ(అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ ఎల్–ఎంఎల్ థర్డ్ విద్యార్థులు క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. జేఎన్‌టీయూ కాలేజీలో పిక్సెల్ 2కె–24 పేరుతో నిర్వహించిన టెక్నికల్ క్విజ్‌లో తమ విద్యార్థులు సమ్రీన్ మొదటి బహుమతి, షేక్ మహమ్మద్ ఇర్ఫాన్ ద్వితీయ బహుమతి సాధించారన్నారు. కోడ్ స్ప్రింట్‌లో చెన్నకేశవ తృతీయ బహుమతి, వల్లిఫాస్ట్ ఫింగర్స్‌లో పూజిత ద్వితీయ బహుమతి, రాజేష్ తృతీయ బహుమతి కైవసం చేసుకున్నారన్నారు. అలాగే ఈ నెల 24న కర్నూలు జిల్లాలోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన టెక్నికల్ క్విజ్‌లో రఫి ద్వితీయ బహుమతి సాధించాడన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, హెచ్ఓడీ డాక్టర్ చిత్రలింగప్ప, ఐఐసీ సెల్ కన్వీనర్ డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్, కోఆర్డినేటర్ కామాక్షమ్మ అభినందించారు.

నెట్టికంటుడి సన్నిధిలో ఆలూరు ఎమ్మెల్యే


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విరుపాక్షి

గుంతకల్లు రూరల్: వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే బీ.విరుపాక్షి బుధవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే విరుపాక్షి కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

కొర్రపాడులో 'పొలం పిలుస్తోంది'

బుక్కరాయసముద్రం: కొర్రపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఏఓ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసే రైతులు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పప్పుశనగ, వరి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, పంటలకు బీమా వర్తిస్తుందన్నారు. పప్పుశనగకు హెక్టార్‌కు రూ.1125, వరి హెక్టారుకు రూ.1575, జొన్న హెక్టారుకు రూ.788, మొక్క జొన్న హెక్టారుకు రూ.1313, వేరుశనగ హెక్టారుకు రూ.1200, టమాట హెక్టారుకు రూ.4 వేల చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. ఏపీఎంఐపీ జిల్లా అధికారి రఘునాథ్‌రెడ్డి, ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి, హెచ్‌ఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్ల ప్రారంభం


ఓఎన్‌జీసీ అధికారులను సన్మానిస్తున్న సర్పంచ్ రవిచంద్రారెడ్డి

పుట్లూరు: సి.వెంగన్నపల్లి సోలార్ ఎల్ఈడీ లైట్లను బుధవారం ఓఎన్‌జీసీ అధికారులు రాబిన్ మాథ్యూ, జగదీష్ పామర్తి ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రవిచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓఎన్‌జీసీ అధికారులు మాట్లాడారు. సి.వెంగన్నపల్లి పంచాయతీ పరిధిలో 2.5 వాట్స్ సామర్థ్యం గల 50 సోలార్ ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సర్పంచ్ రవిచంద్రారెడ్డి అధికారులను సన్మానించారు.

వివాహిత ఆత్మహత్య


వెంకటేశ్వరమ్మ (ఫైల్)

యాడికి: మండల కేంద్రంలో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, మృతురాలి తల్లి నారాయణమ్మ వివరాల మేరకు.. కమలపాడు దారిలో ఉంటున్న మహానందరెడ్డి, వెంకటేశ్వరమ్మ(36) దంపతులు మగ్గం నేస్తూ జీవనం సాగించేవారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తలకు తరచూ గొడవలు జరిగేవి. 4 రోజుల క్రితం ఇద్దరు గొడవ పడడంతో భర్త ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. అనంతపురంలో చదువుతున్న కుమార్తె ఇంటికి వచ్చింది. కుమార్తెకు జ్వరంగా ఉండటంతో టాబ్లెట్ ఇచ్చింది. ఆమె నిద్రలోకి జారుకోగానే ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శానిటేషన్ సమస్యలపై స్పందించండి

గుంతకల్లుటౌన్: వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలపై వెంటనే స్పందించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ వార్డు శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలకు సూచించారు. కౌన్సిల్ మీట్‌లో పలువురు వార్డు సభ్యులు శానిటేషన్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమీషనర్ బుధవారం 14,2,26 వార్డుల్లో పర్యటించారు. సరస్వతీ విద్యా మందిరం వద్ద మురుగు సవ్యంగా పారేలా చర్యలు చేపట్టాలని పీహెచ్ వర్కర్లకు సూచించారు. అత్యవసరమైన చోట గ్యాంగ్ వర్క్‌లు చేయించాలని మేస్త్రీలను ఆదేశించారు.

ఆయకట్టు వివరాల ప్రదర్శన

పుట్లూరు: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఆయకట్టు వివరాలను గ్రామ సచివాలయాలు, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డుల్లో ప్రదర్శించారు. తహసీల్దార్ శేషారెడ్డి ఆదేశాల మేరకు జాబితాను ప్రదర్శించినట్లు వీఆర్వోలు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

తాడిపత్రి రూరల్: ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ కాటయ్య సూచించారు. వెంకటరెడ్డిపల్లిలో బుధవారం పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ పౌరులు తమ హక్కులను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలు తలెత్తినప్పుడు శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు.

ఎన్నికల హామీల అమల్లో విఫలం

తాడిపత్రి అర్బన్: ఎన్నికల హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఐ నాయకులు విమర్శించారు. బుధవారం స్థానిక నెహ్రూ పార్క్‌లో పార్టీ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ ట్రూ అప్ పేరుతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతోందన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు యూనిట్‌కు రూ.1.58 పైసలు భారం పడుతోందని 30 యూనిట్ల కన్నా తక్కువ వాడేవారు రూ.1.90 పైసలు చెల్లిస్తుండగా ఇకపై రూ.2.73 పైసలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పట్టణంలో విద్యుత్ మీటర్లలోని లోపాలతో రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు వస్తున్నాయన్నారు. నాయకులు అబ్రహం, రత్నమయ్య, ఉమాగౌడ్, రమణ పాల్గొన్నారు.

గది నిర్మాణానికి విరాళం

పామిడి: స్థానిక సరస్వతీ ఉన్నత విద్యామందిరంలో గది నిర్మాణానికి బుధవారం వైఎస్సార్‌సీపీ నేత, జ్యువెలరీ షాపు నిర్వాహకుడు కే రఘువీర్ రూ.25 వేలు విరాళం అందజేశారు. డబ్బును స్కూల్ కమిటీ సభ్యులు జోజోడే కుమార్, చౌడయ్యకు అందజేశారు. ఈసందర్భంగా స్కూల్ కమిటీ, ఆచార్యబృందం రఘువీర్ కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ

గుంతకల్లు రూరల్: అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం జరిగిన అండర్ 17 జిల్లా స్థాయి ఫ్రీస్టైల్ స్విమ్మింగ్ పోటీల్లో తిమ్మాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి విష్ణువర్ధన్

సంక్షిప్త సమాచారం

ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా వ్యాప్తంగా 250 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో 12 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా ఇందులో విష్ణువర్ధన్ ఒకరు. వచ్చేనెల 5న పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విష్ణువర్ధన్ పాల్గొంటున్నట్లు హెచ్ఎం నారాయణరెడ్డి తెలిపారు.

బుక్కరాయసముద్రం: కొర్రపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల పీడీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అండర్–17 రేవంత్, రగ్బీ అండర్–14 బాలికల విభాగంలో అలేఖ్య, స్పందన, అండర్–14 బాలురు విభాగంలో ధనుంజయ, ఉష క్రీడలో అండర్–17 బాలురులో ధనుష్, దస్మిత్, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలకు గుంతకల్లు విద్యార్థి


ఆరోనా రోనాడిన్హో

గుంతకల్లు: 4వ జూనియర్ చాంపియన్ షిప్ పోటీల్లో సాఫ్ట్ టెన్నిస్‌కు గుంతకల్లుకు చెందిన ఆరోన్ రోనాడిన్హో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యాడు. ఈ మేరకు బుధవారం స్టాఫ్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్‌కుమార్, అనంతపురం స్టాఫ్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి మేరి జ్యోతి తెలిపారు. నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు చైనాలోని జంగ్షంగ్‌లో జరిగే ఈ పోటీల్లో పాల్గొంటాడన్నారు. గురువారం ప్రత్యేక విమానంలో జట్టు సభ్యులతో కలిసి బయలుదేరుతున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మోదీనాబాద్ విద్యుత్ విభాగంలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న సీ.శేఖర్ కుమారుడు ఆరోన్ రోనాడిన్హో ఓపెన్ డిగ్రీ చేస్తున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి తల్లిదండ్రులతోపాటు గుంతకల్లుకు మంచిపేరు తీసుకురావాలని స్నేహితులు, బంధువులు ఆకాంక్షించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుత్తి: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన రాజేంద్ర(24) కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..ఎంగిలిబండ గ్రామ సమీపంలో ఈ నెల 27న బైక్‌పై వెళ్తుండగా ఐచర్ వాహనం ఢీకొని రాజేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తప్పిన ప్రమాదం

గుత్తి: పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో బుధవారం తెల్లవారు జామున కారు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు..ఆదోనికి చెందిన ఓ కుటుంబం అనంతపురం నుంచి ఆదోనికి వెళుతుండగా మార్గ మధ్యలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. కారులో ఉన్న వారంతా సురక్షితంగా బయటపడ్డారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కాసేపల్లికి చెందిన ముత్యాలరెడ్డి జొన్నగిరిలో పనిముగించుకుని బైక్‌పై బయలుదేరాడు. పంది అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుండెపోటుతో సీపీఐ నేత మృతి

యాడికి: స్థానిక నారాయణస్వామి కాలనీకి చెందిన సీపీఐ నేత వడ్డే బాలన్న బుధవారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి మహమ్మద్ రఫి, నాయకులు నీలూరు లక్ష్మయ్య, సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డే రాముడు, నాయకులు తదితరులు బాలన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.